

కథా కౌముది

# కలిసిన మనసుల స్పందన

కన్నడ మూలం: శ్రీమతి కె.వి.రాజలక్ష్మి
తెలుగు అనువాదం: చందకచర్ల రమేశబాబు

“ఈ క్షణం నిన్ను చూడాలనిపిస్తోంది” ఆలేఖ్య మెసేజ్.

“సరే” బదులిచ్చాను.

“ఇక్కడ విపరీతమైన వర్షం. చలి”

“అలాగా ! అయితే వేడి వేడిగా కాఫీ సిప్ చేస్తూ, వర్షపు చినుకులను ఆస్వాదించు. ఫ్రీ సజెషన్ “ నవ్వు ఇమోజిని జతచేశాను.

“కాఫీ ఎందుకు ? దానికంటే మంచిది !?”

“పకోడా, జామూన్?”

జామూన్ తనకిష్టమైన స్వీట్. క్రితం సారి హోటల్లో మా స్నేహితుల మూక మీట్ అయినప్పుడు ఒకటికి రెండు జామూన్ తిన్నది..... ఫుడ్డి.

కోపం ఎమోజీ ఆ వైపు నుండి వచ్చింది. “సారీ....”అన్నాను.

“ఓడిపోయాను అని ఒప్పుకో”

“నీకు ఎప్పుడో పడిపోయానుగా “ టైపు చేసిన మెసేజ్ ను తుడిచేశాను. తన మంచి మూడ్ ను పాడు చెయ్యడం ఇష్టంలేదు వద్దనిపించింది.

“నిన్న పంపిన పాట మళ్ళీ విన్నప్పుడు లోపల్లోపలే నవ్వు నాకు. గబగబా తాళానికి వేచి ఉండకుండా... వేచి చూస్తే వెయిట్ చేస్తున్న గర్ల్ ఫ్రెండ్ అలక చెందుతుందేమో అన్నట్టుగా.... లయ తప్పింది.”

నేను నవ్వాను. తను ఎంత కొంటెగా ఉడికించినా నాకు ఇష్టమే. ఒక్కొక్క క్షణాన్నీ జీవించే అమ్మాయి తను.

కానీ తనే వేసుకున్న కంచె లోపల జీవితాన్ని అరగదీస్తున్న అమాయకురాలు. అవును. నా మట్టుకు అదే కాలేజ్ పిల్ల ! వయస్సు మీద పడితేనేమిటి....!

“ఏదో కాల్ వస్తోంది. క్యాచ్ యు లేటర్” అంటూ చాట్ ముగించింది.

★★★★★

నాలుగు సంవత్సరాల క్రితం నేను నా మిత్ర బృందం వాట్సప్ లో  చేరినప్పుడు తను లేదు.

“ఆలేఖ్యా ఏదిరా?గ్రూపులో కనిపించడంలేదు” ఆసక్తితో అడ్మిన్ సూరిని అడిగాను.

“తన భర్త చనిపోయాడ్రా. కొన్ని రోజులు గ్రూప్ లో ఉండను అనింది. అప్పుడే నాలుగైదు నెలలయ్యింది. తనతో మాట్లాడి మళ్ళీ గ్రూపులో చేరుస్తాను” అన్నాడు.

అంటే, తను తాత్కాలికంగా ఎక్సిట్ అయిందంతే.

“అలా చెయ్యి. ఎన్ని రోజులని పోయిన వాళ్ళ జ్ఞాపకాల్లో ఉండగలం ! లైఫ్ షుడ్ మూవాన్ !” నేను కూడా గొంతు కలిపాను.

“ఒక్కడే బాబు. ఐఐటి కాన్పూర్ లో చదువుతున్నాడు. ఆ విషయంలోతను లక్కీ” అంటూ ఆ రోజు వెళ్ళిపోయాడు.

ఐదు సంవత్సరాలు జతగా చదువుకున్నవాళ్ళం, బిఎస్సి అయిపోగానే నేను మాస్టర్స్ కోసం ఢిల్లీ వెళ్ళిపోయాను. మొబైల్ ఫోన్లు లేవప్పుడు. ఊరికి వచ్చినప్పుడు కలిసిన స్నేహితులతో మిగిలినవాళ్ళ గురించి ఎంతో కొంత సమాచారం అందేది. ఉద్యోగ నిమిత్తం విదేశంలో ఉన్నాక కలవడం కూడా చాలా తగ్గిపోయింది.

ఆలేఖ్య మళ్ళీ గ్రూపులో చేరింది కానీ ముందులా యాక్టివ్ గా లేదు. దీన్ని గమనించి "కొన్ని నష్టాలే అలా! పూడ్చలేం. అందులోనూ ఆత్మీయులయితే దాని బాధ ఇంకా ఎక్కువ. కానీ ఆ బాధను అధిగమించి జీవితాన్ని ముందుకు తీసుకువెళ్ళాలి. మనకు వేరే దారి లేదు" అంటూ తనకు వ్యక్తిగత మెసేజ్ పెట్టాను. దానికి బదులుగా లావాలాంటి బదులు " నీ కరుణ, జాలి, సలహా నాకక్కర్లేదు. లైఫ్లో నువ్వు ఏం కష్టాలు అనుభవించావు ? చదువు ముగించి భేషుగ్గా ఫారిన్ వెళ్ళిపోయావు. పెళ్ళి చేసుకుని హాయిగా ఉన్నావు. నా మాదిరిగా సంసార దుఃఖం ఏమైనా అనుభవించావా ?" అంటూ దులిపెసింది.

"సారి...."అంటూ మెసేజ్ పెట్టి క్షమాపణ అడిగాను. నాకు ఈ రకమైన చెంపదెబ్బ నచ్చలేదు.

నా సంసార జీవితం సుఖమయమని ఈమె మాత్రం కాదు, బహుశా నా స్నేహితులంతా నమ్మారు.

నిట్టూర్చాను.

బయటికి కనిపించింది అలాగే. మూడవ అక్కయ్య పెళ్ళయ్యాక, పెద్ద బావ దగ్గర చుట్టం: హైదరాబాదులో ఉన్న అంకితతో నా పెళ్ళి జరిగింది. అప్పటికి నాకు ముప్పై నాలుగు సంవత్సరాలు. ప్రస్తుతానికి పిల్లలు వద్దన్న అంకిత నిర్ణయం ఆశ్చర్యపరచింది. ఆమె కూడా అప్పటికి ముప్పై దరిదాపుల్లో ఉంది. "ఐ వాంటు ఎంజాయ్ లైఫ్" అనింది. ఆ సాకుతో ఉత్త తిరుగుళ్ళే ! తన స్నేహితురాళ్ళు, బంధువులు చాలా మంది విదేశాల్లో కూడా ఉండడం వల్ల ఏదో ఒక కారణం చెప్పి, బాగా తిరిగేది. నాకు నచ్చకపోయినా ఊరకున్నాను. పుట్టింటి వాళ్ళు శ్రీమంతులు కావడంతో సంవత్సరానికి రెండు మూడు సార్లు చిన్నా చితకా ఫంక్షన్లకు కూడా స్వదేశానికి వెళ్ళేది. ఖర్చుకు నన్ను అవలంబించలేదు. తరువాత పిల్లలు కావాలనుకున్నా కలిగే సూచనలు కనిపించలేదు. వైద్య పరీక్షలో తనకేదో లోపం ఉన్నట్టు తెలిసొచ్చి చికిత్స ప్రారంభమయ్యింది. సుమారు ఆరు సంవత్సరాలు ఆస్పత్రుల చుట్టూ తిరగడం, చికిత్సలు తనను హైరాన పెట్టాయి. నిరీక్షించిన ఫలితాలు రాకపోయేసరికి దైహికంగా, మానసికంగా కూడా క్రుంగిపోయింది. దీనికి తోడు ఏదో వింత వ్యాధి సోకింది. "ఒకట్రెండు ఆపరేషన్లు చేయించుకుని, రెగ్యులర్ గా మందులు తీసుకుంటే నాలుగైదు సంవత్సరాలు ఉండచ్చు. కానీ చికిత్సలోని సైడ్ ఎఫెక్ట్స్ చెప్పలేం"

అన్న వైద్యుల మాటలు విన్న తరువాత ఆమెలో బ్రతికే ఉత్సాహం కరువైంది. ఆ రోజునుండి ఒక రకమైన ఆధ్యాత్మ చింతనలో పడిపోయింది. "ఇంకెవరినైనా పెళ్ళి చేసుకో. ఇంకా చాలా జీవితం మిగిలుంది నీకు " అని వేడుకునేది.

నాకయితే ఈ అనిశ్చిత బ్రతుకు పైన విరక్తి పుట్టింది. రోజులు లెక్కపెడుతున్న భార్యతో జీవితం గడపడం ఏం సుఖమయం? మరి కొన్ని నెలల్లో నేను ఒంటరినవుతాను ! అంకిత నన్ను వదలి వెళ్ళిపోతుంది. ఆమె చివరి కోరికగా ఆమెను హైదరాబాద్ లో వదిలాను.

ఆ రోజుల్లోనే ఆలేఖ్య విషయం తెలిసింది ! సహజమన్నట్టు ఊరడింపు మాటలు చెప్పాను. కానీ ఆమె ఎందుకో గంభీరంగా తీసుకుంది.

అంకిత ఈ లోకం వదిలి వెళ్ళిపోయినప్పుడు తాత్కాలికంగా అందర్నీ వదిలేసుకున్నాను. కొన్ని రోజులవరకూ ఎవరూ వద్దనిపించింది.

★★★★★★★

"విశోక్ ! మీకు ఇష్టమయితే మాట్లాడదాం సరేనా ? నన్ను క్షమించు " ఆ రోజు ఆలేఖ్య మెసేజ్ వచ్చింది.

నా సమ్మతి తెలియజేసిన తరువాత కాల్ లో ఫార్మల్ గా కొన్ని సాంత్వన వచనాలు తెలిపింది.

క్రమంగా  మా ఇద్దరి మధ్య ఒక కంఫర్ట్ లెవెల్ ఏర్పడింది. సహచరులను పోగొట్టుకున్న సమాన బాధితులం. " ఆయన కెమిస్ట్రి ప్రొఫెసర్. ఆయన ల్యాబే ఆయన మొదటి ఇల్లు,ప్రయోగాలే సంసారం అనేలా ఉండేవారు. నాలాంటి భావుక జీవులకు తగినవారు కాదు. నలుగురిలో ప్రొఫెసర్ గారి భార్య అనే గౌరవం ఉండేదంతే. బాబు పుట్టిన తరువాత ఒక రోజు కన్ఫెస్ చేసుకున్నారు. 'నేను సంసార జీవితానికి తగిన వాడిని కాను, నా ఆశయాలన్నీ నా పరిశోధనలు. నువ్వు సర్దుకుని పోతున్నావు. నేను ఎప్పుడూ ఋణపడి ఉంటాను' అనేవారు. ఇంటి వ్యవహారమంతా నా చేతుల్లోనే. చీరలకు, నగలకు కావలసినంత కంటే ఎక్కువే డబ్బులిచ్చేవారు. ప్లీస్ బేర్ విత్ మి అనే ట్యాగ్ దాంతోపాటు ! చాలా మంచాయన...... వదిలెయ్యడానికి ఏ కారణమూ దొరకనంతగా.... మొదటి రోజుల్లో కష్టమనిపించినా

సర్దుకుపోయాను. కానీ అంత ఆత్మీయమనిపించిన ల్యాబ్ లోనే అకాల మరణం ఆయనకు. తరువాత ఉద్యోగానికి వెళ్ళడానికి ఇష్టముండేది కాదు. ఇంట్లో కూర్చుని విసుగు. బాబేమో హాస్టల్ లో ఉన్నాడు. ఈయన డెత్ బెనిఫిట్స్ చాలానే వచ్చాయి. కానీ.....” ఫోన్లో మాట్లాడేటప్పుడు గొంతు వణికింది.

వీకెండ్స్ కు ఆమె కాల్ కోసం కాచుకునేవాణ్ణి. అంకిత గురించి చెప్పాను. తరువాత మా పాత వైవాహిక జీవితాల గురించి మాట్లాడలేదు... దాని అవసరం కూడా రాలేదు.

బాబు ప్రోగ్రెస్ గురించి, తన ఆఫీసు విషయాల గురించి అప్పుడప్పుడు చెప్పేది. మా ఇద్దరినీ కలిపిన విషయం అంటే నా పాటలు. కాలేజీలో పాడేవాణ్ణి. స్నేహితుల గుంపులో, ఏదైనా ఈవెంట్లలో అయితే చెప్పనవసరం లేదు. కరోకేతో ఆటో రికార్డింగ్ ఆప్ వచ్చిన తరువాతైతే పాడడం సులువయ్యింది. సంతోషం కానీ, దుఃఖం కానీ రెండింటికీ నా వద్ద ఉన్న మందు పాత పాటలు. వాటిన గుంపులో పంచుకునేవాణ్ణి. “ పాట విడియో పంపు” అన్నవాళ్ళకు అలాగూ చేసి పంపేవాణ్ణి. ఆలేఖ్య గ్రూపులో మెచ్చుకున్నా, వ్యక్తిగత చాట్లో మాత్రం “ఇక్కడ శ్రుతి కుదరలేదు, ఇక్కడ భావం దెబ్బ తినింది" అంటూ కామెంట్ చేసేది. “దాని వల్ల సరిదిద్దుకోవడానికి అవకాశం కల్పిస్తున్నావు. థ్యాంక్స్” అని తెలిపేవాణ్ణి.

“నువ్వు ఇండియాను మిస్ చేయవా?” అని ఒకసారి అడిగింది.

“చేయకుండా ఉండగలనా ? నా మాతృభూమి, స్నేహితులు, భోజనం, తిళ్ళు, ప్రేమ, ఆత్మీయత, అభిమానం.... అక్కడిలా ఇక్కడ దొరకలేదనే చెప్పాలి. ఒక రకమైన మొనాటనీ ఇక్కడ. అదీ కాకుండా గురి తెలియని ఒంటరి జీవితం నరకం. అక్కడికి రావడానికి ఏ బలమైన కారణమూ దొరకడం లేదు” అన్నాను.

సూరి మాత్రం “మరో పెళ్ళి చేసుకో. ఎంతైనా మనసులోని మాటలను పంచుకోవడానికి ఒక సహచరి దొరుకుతుంది" అని రెండు రోజులకొకసారి చెప్తున్నా ఎందుకో నిర్ణయం తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నాను. మళ్ళీ వేవ్ లెంగ్త్ మ్యాచ్ కాకుండా ముందు మాదిరిగానే అయితే అనే జంకు.

ఆలేఖ్య మనసు విప్పి కబుర్లు చేప్తోంది. నాకు తెలిసినట్టు తను సూరితో తప్ప మా ఇతర సహపాఠులతో ఇంత మనసు విప్పి మాట్లాడదు. సూరి తన పెద్దమ్మ కొడుకనుకోండి ! ఒకసారి తనే ఆ సందేహాన్ని కూడా తీర్చింది.” నీకు ఆశ్చర్యం అనిపించవచ్చు. నీతో మాత్రమే ఇంత కంఫర్టబల్ గా చాట్

చేసేది. అది కూడా ఒన్ టు ఒన్ ! అంతే. నేనయితే ఒంటరి జీవిని. నాకు ఎవరి హక్కునూ లాక్కునే ఇష్టముండదు. నాకు కర్మఫలంలో నమ్మకం ఎక్కువ. ఇప్పుడు వచ్చే కష్ట సుఖాలు పూర్వజన్మార్జితాలు అనేది గాఢంగా నా తలలో కూర్చుండి పోయింది. నాది కానిది నేను కోరుకోను. ఇది నేనే నాకు వేసుకున్న నియమం అనుకోవచ్చు"

నిజమే. అంకిత పోయిన తరువాత అలా హక్కుగా దగ్గరయ్యేవారు ఎవరూ లేరు కదా ! లేఖి..... మనస్సులో అలా పిల్చుకునే పిలుపును ఒకసారి తెలియకుండానే టైప్ చేసి పంపేశాను. "ఐయామ్ ఒకె వితిట్" అంటూ పచ్చ జెండా చూపింది.

★★★★★★★

"ఎందుకో.... ఫీలింగ్ డిస్టర్బ్డ్" లేఖి మెసేజ్ చూశాను. ఇక్కడ ఇంకా తెలవారలేదు. ఏదో గంభీరమైన విషయమే ఉండాలి అనుకున్నాను. కాల్ చేశాను.

"లేఖి ! అంతా ఓకేనా ?" అడిగాను.

"అవును"

"మరి ఏమయ్యింది?"

"మా సెక్షన్ హెడ్ పరమేశ్వర్ గారి భార్య చనిపోయింది అని చెప్పాను కదా !"

"అవును. అయిదారు నెలలయింది కదా ?"

"అది కాదు సంగతి. ఆయన ఇంకో పెళ్ళి చేసుకుని, రేపు సాయంత్రం హోటల్లో పార్టీ ఇస్తున్నారు."

"మంచిదే కదా ! అందరికీ తన కొత్త భార్యను పరిచయం చేసినట్టుంటుంది"

"ఆఫీసులో ఒకటే గుసగుసలు..... ఇంత తొందరగా ఈ వయసులో మళ్ళీ పెళ్ళి కావలసి వచ్చిందా అని"

"నీకేమనిపించింది?"

"ఆయన కోణంలో ఆయన చేసింది సరిగ్గానే ఉంది... ఇద్దరు పిల్లలు, ఇద్దరూ విదేశాల్లో ఉన్నారు. తల్లి కర్మలకు వచ్చారు– వెళ్ళారు. 'ఎలా ఉన్నావు అని అడిగే దిక్కే లేదు. పోయినవాళ్ళ జ్ఞాపకాల్లో

జీవించడం, బ్రతుకు గడపడం అంతా బుల్షిట్... నాకొక జత కావాలి. దానికి ఎవరి అనుమతి కూడా అక్కర్లేదు' అన్నారట"

"అంతే మరి. ఎవరి బ్రతుకును వారు శాసించుకుంటారు, తమకు నచ్చినట్టు. నీ భాషలో చెప్పాలంటే ఆయన ఎవరి హక్కునూ లాక్కోలేదు కదా !

ఆయన ఒక మామూలు మనిషి. వైరాగ్యం కోసం, మోజుకోసం పెళ్ళి అనే హిపోక్రసి లేదు. తనకు ఏది కావాలో అది చేశారు. ఆయన నిర్ణయాన్ని నేను అభినందిస్తాను. అది సరే ! నువ్వు డిస్టర్బ్డ అయిందెందుకు?"

"తెలీదు"

"నాకు తెలుసు. నీక్కూడా మనసులో ఎక్కడో ఒక మూల మళ్ళీ పెళ్ళి చేసుకుందామని అనిపించి ఉండవచ్చు. అలా అనిపించడంలో తప్పేం ఉంది? నీ జీవితం, నీ నిర్ణయం. నీ కొడుకుకు మాత్రం జవాబు ఇవ్వాల్సి ఉంటుంది. అంతే "

"........."

"పై వారం ఢిల్లీకి వస్తున్నాను. పదిహేను రోజుల పని. వీలైతే మనం కలవచ్చు." మాట మార్చాను.

"హౌ నైస్ ! ఈ సారి మా ఇంటికి తప్పకుండా రావాలి. నామీద ఒట్టు."

నవ్వాను.

"ఎందుకా నవ్వు ?" బుంగమూతి అటు వైపు.

"ఏం లేదు. స్వాగతం ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నా"

"నీ ఊహ కంటే ఎక్కువగానే "

"సరే" కాల్ ముగించాను.

ఒకటి మాత్రం స్పష్టమయ్యింది.

లేఖితో జరుగుతున్న ఈ కొత్త పరిచయంలో, స్నేహం దశ దాటిన మధురమైన భావనలు నాకేం అగోచరం కావు. నా ప్రతిక్రియకు తనూ కాచుకుంటుంది. మా ఇద్దరి మధ్య గుప్తగామినిగా ఉన్న

ప్రేమ ఇద్దరికీ ఆప్యాయమానంగా ఉంది. నేనైతే ఒప్పుకున్నాను. తను మాత్రం ఇంకా అదెందుకో వెనుకడుగు వేస్తోంది. సూరి ఇటీవల నన్ను "మళ్ళీ పెళ్ళి చేసుకో"అన్నప్పుడు " ఓకె" అని వెంటనే అనడం గుర్తుకు వచ్చింది.

★★★★★★★

హోటల్ పార్టీవి కొన్ని ఫోటోలు వేసి " రిటర్న్ గిఫ్ట్ అని ఒక జనపనార సంచి ఇచ్చారు. సింపల్ కానీ ఫ్యాన్సీగా ఉంది. ముఖ్యంగా అది ఇకో ఫెండ్లీ. ఇద్దరి జంట కూడా బావుంది. వయసుకు తగ్గ గాంభీర్యమున్నా ఆమె మాతో కలుపుగోలుగా మాట్లాడారు. బఫె భోజనం. అందరినీ పలకరించి మరీ కనుక్కున్నారు. " పటపటా టైప్ చేసింది.

తనలో ఒక కొత్త ఉత్సాహం కనిపించడం చూసి మెసేజ్ పెట్టడానికి బదులు నేరుగా కాల్ చేశాను.

"ఫోటోలు బాగున్నాయి. స్ట్రాబెరి పింక్ నీకు చాలా నప్పింది. గుంపులో నువ్వు

ప్రామినెంట్ గా కనిపిస్తున్నావు" ధైర్యంగా తనను మెచ్చుకున్నాను. ఆశ్చర్యం అంటే తను నేననుకున్నట్టుగా కాకుండా "థ్యాంక్యూ విశూ" అన్నది. మొట్ట మొదటి సారిగా నా పేరుని ముద్దుగా పిలిచింది.

"లేఖి ! రెండు నిమిషాలు ఓపికగా వింటానంటే ఒక సంగతి చెప్పనా ?"

"వినే మనసుంది. ఏమైనా చెప్పు" నవ్వింది....

"డన్ ! లేఖి... శ్రుతి, లయ రెండూ ఉంటే సంగీతం వినసొంపుగా ఉంటుంది. అది నిజం. ఒక్కోసారి శ్రుతి కలవకపోయినా లేక లయ తప్పినా పాట కొనసాగుతుంటుంది. చాలా కర్కశంగానో లేదా అసహనీయంగానో అనిపిస్తేనే ఆ పాటకు తెరపడుతుంది. ఆనందించేవారి మనఃస్థితికి తగ్గట్టు కదా ? మన దాంపత్యం కూడా అంతే.... ఇబ్బంది అనిపించినా, సర్దుబాటు లేకపోయినా దాంపత్యం రథం నడుస్తూ ఉంటుంది, అసాధ్యం అనే మజిలీ చేరుకునేవరకూ. అలాగే ఏదో కారణానికి ఆగిపోయిన దాంపత్య గీతానికి కొత్త శ్రుతి, లయలతో మరో అవకాశం దొరికినప్పుడు ఎందుకది ఆగిపోవాలి ? ఒన్స్ ఫ్లాప్ అయితే ఆల్వేస్ ఫ్లాప్ అని ఎందుకనుకోవాలి ? వాస్తవాల మధ్య బ్రతుకుతున్నాం. ఉత్త ఊహల్లోనే బ్రతుకు కాదు కదా !"

“...........”

“ఈ మధ్య, నాకూ కూడా మరో పెళ్ళి చేసుకునే ఆలోచన సతాయిస్తోంది. ఎందుకు చేసుకోకూడదు అనిపిస్తుంది. కానీ అపరిచితులతో దాంపత్యం అంటే చాలా లెక్కలేసుకోవాలి. అదే తెలిసిన వాళ్ళ మధ్య అయితే అంత రిస్క్ ఉండదు అనిపిస్తుంది. ఇంకా ఎన్నాళ్ళు బ్రతకాలో ? ఎందుకు ఒంటరిగా గడపాలి?”

“అవును. నువ్వు చెప్తోంది నిజమే “

“నేను నీతో ఇది ఎందుకు చెప్తున్నానో అని అర్థమవుతోంది అనుకోనా ?”

మళ్ళీ అవునంది.

“అబ్బ ! అంత చాలు. నా ఉద్దేశం సఫలమయినట్టే. సరే. పడుకో లేటయింది. గుడ్ నైట్” అన్నాను.

తను “గుడ్ డే” అంటూ కాల్ కట్ చేసింది.

★★★★★★★★★★

సూరి ఒక స్నేహకూటం ఏర్పాటు చేశాడు. ఆదివారం, ఒక రిసార్ట్ లో. స్నేహితులంతా కలిసే అవకాశం. “లేఖి, నువ్వు మిస్ చేయరు కదా ? పికప్, డ్రాప్ నేనే చేస్తాను” సూరి గ్రూప్ లోనే పోస్ట్ చేశాడు. తన పిన్ని కూతురు అనే చనువు అప్పుడప్పుడు వాడి మెసేజుల్లో కనిపించేది.

“శనివారం మూడింటికల్లా బెంగళూరు చేరుకుంటాను. రాత్రి సూరితో పార్టీ” లేఖికి మెసేజ్ పెట్టాను.

“ఏర్ పోర్ట్ నుంచి నేరుగా మా ఇంటికి వచ్చెయ్యి. అడ్రెస్ పంపాను చూడు”

“నేనొక్కణ్ణే ! ఫరవాలేదా ?” కొంటెగా అడిగాను.

“ధైర్యం లేకపోతే సూరిక్కూడా చెప్తానులే “

జవాబు మనసుకు హాయినిచ్చింది.

★★

లేఖి ఇల్లు చేరేసరికి నాలుగున్నరయ్యింది.

నేనే చెప్పాను – ముందుగా కాఫి, తరువాతే ఏమైనా అని. అలాగే ఫ్రెష్ అయ్యి వచ్చేటప్పటికి కాఫి రెడిగా ఉండింది.

“రా. నీకు మా తోట చూపిస్తాను. తరువాత చపాతీలు ఒత్తుతాను. వెజిటబల్ కుర్మా అప్పుడే చేసేశాను” అంటూ పెరటికి తీసుకువెళ్ళింది. యూనివర్సిటీ క్వార్టర్స్. ముంగిలి, పెరడు రెండూ ఉండేలా కట్టిన అప్పటి ఇల్లు. మామిడి, జామ, దానిమ్మ చెట్లతో పాటు కొన్ని పూల మొక్కలు. ఒకవైపు కూరగాయల లతలు కళ్ళకు ఆహ్లాదాన్నిచ్చాయి. తను ఏదో చెప్పాలనుకుంటున్నదని తనను చూస్తుంటే అనిపించసాగింది.

“ఆయన పోయిన తరువాత ఈ ఇంటికి వచ్చింది.... ఆ ఇల్లు ఇంకా పెద్దది. ఈ ఇంటి ఋణం ఎన్నాళ్ళో ఎవరికి తెలుసు?” తన అంతరంగం కొద్ది కొద్దిగా తెరుచుకుంటోంది.

నాకు మళ్ళీ ఆశ్చర్యం కలిగింది.

ఉన్నట్టుండి సన్నగా జల్లు కురిసేటప్పటికి ఇంట్లోకి వచ్చాము.

“అబ్బబ్బ అంటే ఇంకో సంవత్సరం అమెరికాలో. తరువాత ఇక్కడికి వాపస్”

“హౌ స్వీట్!” భుజాలెగరేసింది.

“కానీ ఈ ఊరు కాదు. ఉత్తర్ ప్రదేశ్”

“సో వాట్? అక్కడ కూడా ఉంటే సరి”

“లేఖీ......?” అన్నాను.

“ అవును. లెట్ మి లివ్ మై లైఫ్ అని నాకూ అనిపిస్తోంది. బాబుకు మాత్రం చెప్పాను. సంతోషించాడు. మరుసటి నెలలో వాడు వాడి గర్ల్ ఫ్రెండ్ ఇద్దరూ విదేశాలకు వెళుతున్నారు. ఒకే కంపెనీలో పని చేస్తున్నారు. లివింగ్ ఇన్ లో ఉన్నారు. ప్రస్తుతానికి పెళ్ళి అక్కర్లేదట. వాడి చాయ్స్ వాడిది. మనసుకు కంచె వేయలేము కదా ?”

“ఈ కాలం పిల్లలు ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. మార్పులకు కూడా తొందరగా అలవాటు పడతారు. ’ యె దిల్ తుమ్ బిన్ కహి లగ్తా నహీ హమ్ క్యాకరే.....’ అన్నాను.

"నా మొబైల్ రింగవుతోంది" అంటూ మొబైల్ తీసుకుని " అలాగే అలాగే" అని మొబైల్ క్రింద పెట్టింది.

"సూరి మాట్లాడింది.... నువ్వు వచ్చావా అని అడిగాడు. నీ నిర్ణయం చెప్పావా అని అడిగాడు "

"ఏ నిర్ణయం" అని అడిగేంతలో మళ్ళీ ' యె దిల్ తుమ్ బిన్ కహి లగ్తా నహీ హమ్ క్యాకరే.....'పాట. ఈ సారి పాడింది మాత్రం లేఖ.

బదులుగా ప్రేమగా హత్తుకున్నాను.

సన్నగా పడుతున్న జల్లు పెద్దదై భోరున వాన కురవసాగింది.

COMMENTS